


ఇబ్బందులను 'సాక్షి'తో పంచుకుంటున్న కాలనీ వాసులు



నిరసన తెలుపుతున్న స్థానికులు

మీతో సాక్షి

అటు ఇటు పూర్తి.. మధ్యలో నిలిచి!

1.5 కిలో మీటర్లలో నాలా విస్తరణ పనులు దాదాపు పూర్తి

కేవలం 200 మీటర్ల మేర ఆగిన పనులు

ఈ స్థలం ప్రైవేట్ వ్యక్తిది కావడంతో ముందుకు సాగని వైనం

మిగిలిన పనులు త్వరగా పూర్తి చేయాలని స్థానికుల వేడుకోలు

ప్రైవేట్ వ్యక్తి స్థలం నుంచి నాలా పనులు.. కోర్టు స్టే

నిజాంపేట్: వర్షా కాలంలో వరద నివారణ కోసం.. ముంపు సమస్య శాశ్వత పరిష్కారానికి నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో రెండు సంవత్సరాల క్రితం నాలాల విస్తరణ పనులు మొదులు పెట్టారు. ఎస్‌ఎన్‌డీపీ(స్ట్రాటజిక్ నాలా డెవలప్‌మెంట్ ప్రోగ్రాం.) పనులు సుమారు రూ.3 కోట్లతో 1.5 కిలో మీటర్ల మేర పనులు జరిగాయి. శాశ్వత పరిష్కారం దిశగా అధికారులు చేపట్టిన ఈ పనుల పట్ల స్థానిక ప్రజలు నాడు ఎంతో సంతోషించారు. కానీ రూ.3 కోట్లతో పూర్తి చేసిన పనులు 200 మీటర్ల స్థలంలో నిలిచి పోవడంతో నిరుపయోగంగా మారింది. దీంతో స్థానికులు దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్నారు. ఆ స్థలం ప్రైవేట్ వ్యక్తిది కావడంతో అతను కోర్టు ద్వారా స్టే తెచ్చుకున్నాడు. దీంతో పనులు నిలిచిపోయాయి. పనులను పూర్తి చేయాలని ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా.. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని కాలనీల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అసలు సమస్య ఇదే..

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని బాచుపల్లిలోని బైరుని చెరువు నుంచి కాసాని కౌసాల్య కాలనీలోని మందెల కుంట వరకు సుమారు 1.5 కిలో మీటర్ల దూరం ఎస్‌ఎన్‌డీపీ నాలా విస్తరణ పనులను కార్పొరేషన్ అధికారులు చేపట్టారు. ఇందులో 99 శాతం పనులు పూర్తయ్యాయి. కానీ కాసాని కృష్ణ కాలనీ వెనుక ఓ ప్రైవేట్ స్థలం ఉంది. ఈ స్థలం తనదంటూ సదరు వ్యక్తి కోర్టుకు వెళ్లి తన స్థలం నుంచి నాలా పనులను చేపట్టకుండా స్టే తెచ్చుకున్నాడు. అయితే ఈ ప్రైవేట్ స్థలం ఇటు బాచుపల్లి నుంచి కౌసాల్య కాలనీ వరకు ఉన్న నాలాకు సరిగ్గా మధ్యలో ఉంటుంది. ఇప్పటికే ఎస్‌ఎన్‌డీపీ పనులను ప్రారంభించిన అధికారులు స్టే ఉన్న సుమారు 200 మీటర్ల వరకు నాలా పనులు చేపట్టలేదు. ఇటు బాచుపల్లి వైపు, అటు కౌసాల్య కాలనీ వైపు పనులను పూర్తి చేశారు. సదరు స్థలం యజమాని తన స్థలం సుమారు 300 గజాల వరకు నాలా నిర్మాణంలో పోతుందని, తనకు నష్టపరిహారం ప్రస్తుతం మార్కెట్ వాల్యూ ప్రకారం ఇస్తే తనకు ఎలాంటి అభ్యంతరం



నాలాలో నిలిచిన మురుగునీరు

లేదని అప్పట్లో అధికారులకు చెప్పినట్లు సమాచారం. ఒక వేళ నాలా దిశను మార్చడానికి కూడా అనుకూలంగా లేదు. ఓ వైపు గేటెడ్ కమ్యూనిటీ కాలనీ ఉంది. మరో వైపు ఖాళీ స్థలం ఉన్నా అది కూడా ప్రైవేట్ భూమి కావడంతో సమస్యకు పరిష్కారం లభించడం లేదు. దీంతో నాలాలో రెండు వైపుల వరద నీరు, డ్రైనేజీ నీరు చేరి ప్రవహించకుండా నిల్వ ఉండటంతోనే అనేక సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి.

నాలా ఎటు పోయింది..

బైరుని చెరువు నుంచి మందెల కుంట వరకు ఉన్న ఈ నాలా ఇక్కడి ప్రాంతంలో కనిపించడం లేదు. అసలు ఎక్కడ మిస్ అయ్యింది. ఎవరైన బిల్డర్లు కబ్జా చేశారా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రతి చెరువు నుంచి వరద నీరు ప్రవహించేందుకు కాలువ ఉంటుంది. ఈ కాలువను ఇష్టానుసారంగా ఎక్కడ బడితే అక్కడ కబ్జా చేయడంతోనే నేడు ఈ పరిస్థితి వచ్చిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.



నాలా పనులు పెండింగ్ ఉన్న ప్రాంతం

భరించలేని దుర్గంధం

బాచుపల్లి పరిసర ప్రాంతాల్లో భవన నిర్మాణాలు ఎక్కువ. ఇక్కడ పని చేసే కార్మికులు వందల సంఖ్యల్లో ఉంటారు. చుట్టూ గేటెడ్ కమ్యూనిటీ కాలనీలు, అపార్ట్‌మెంట్లు ఉన్నాయి. ఇలా అన్ని ప్రాంతాల నుంచి మురుగు వచ్చి దిగువకు ప్రవహించకుండా నాలాలోనే నిల్వ ఉంటుంది. దీంతో భరించలేని దుర్గంధంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దోమల వల్ల డెంగీ లాంటి విష జ్వరాల బారిన పడుతున్నారు. ప్రతి నిత్యం ఏదో ఒక సమస్యతో ఆసుపత్రి పాలవుతున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాదకరంగా ఓపెన్ నాలా

నాలా విస్తరణ పనులు చేపట్టిన అధికారులు నాలా చుట్టూ ప్రమాదాలు జరుగకుండా మెష్(జాలి) చుట్టినా అది పూర్తి స్థాయిలో లేకపోవడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. భారీ వర్షాలు కురిసిన సమయంలో వరద ప్రవాహం తీవ్రంగా ఉంటుంది. అక్కడ నాలా ఉందన్నట్లు కనిపించన్నంత స్థాయిలో వరద ప్రవహిస్తుందని స్థానికులు పేర్కొంటున్నారు. వర్షాలు పడే సమయంలోనే కాకుండా ప్రస్తుతం కూడా నాలా ప్రమాదకరంగా ఉందని, చిన్న పిల్లలు, వృద్ధులు అందులో పడే ప్రమాదం పొంచి ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మా గోడు ప్రభుత్వం వినాలి



తమ చుట్టూ ఉన్న నాలాలోని మురుగు నీటితో దుర్గాంధాన్ని భరించలేకపోతున్నాం. ఇంట్లో ప్యూరిఫైయర్స్ పెట్టుకునే పరిస్థితి వచ్చిందంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో ఆలోచించండి. స్వచ్ఛమైన గాలిని కూడా పీల్చలేని దుస్థితిలో ఉన్నాం. మా గోడు ప్రభుత్వం వినాలి.

– దీప్తి, బాచుపల్లి.

దుర్గంధం మరింత పెరిగింది



బాచుపల్లి పరిసర ప్రాంతాల్లో నిర్మాణంలో ఉన్న భవనాల్లో పని చేసే కార్మికుల కోసం తాత్కాలిక టాయిలెట్స్‌ను ఏర్పాటు చేశారు. ఆ టాయిలెట్స్‌ను మొత్తం ఈ నాలాకు నేరుగా కనెక్ట్ చేయడంతో ఈ దుర్గంధం మరింత పెరిగింది. నాలాలోకి వచ్చిన మురుగు నీరు కనీసం ముందుకు కూడా ప్రవహించకుండా ఇక్కడే నిలిచిపోవడంతో సమస్య తీవ్రత చెప్పలేనంతగా ఉంది.

– అనిత,బాచుపల్లి.

తిరిగి తిరిగి అలసి పోయాం



తాము ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరించాలని రెండు సంవత్సరాలుగా అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్నాం. అయినా సమస్య పరిష్కారం కావడం లేదు. ప్రతి నిత్యం వేలాది మంది ప్రజలు ఎదుర్కొనే ఇంతటి ప్రమాదరకమైన సమస్యను పరిష్కరించడంలో అధికారులు ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో తమకు అర్థం కావడం లేదు.

– శివశంకర్‌రెడ్డి, కాసాని కృష్ణ కాలనీ, బాచుపల్లి.

సమస్యను వెంటనే పరిష్కరించాలి



బాచుపల్లిలో ఎస్ఎన్‌డీపీ నాలా విస్తరణ పనులు పూర్తి అయ్యే విధంగా ప్రభుత్వం వెంటనే చొరవ చూపాలి. కోట్ల రూపాయలతో పనులు చేసినా ఉపయోగంలో లేదు. ప్రభుత్వం వెంటనే ఈ సమస్యను గుర్తించి పరిష్కరించి ప్రజల ఇబ్బందులను తొలగించాలి.

– కాసాని సుధాకర్, కార్పొరేటర్ బాచుపల్లి

కార్పొరేటర్‌ను కలిసిన నూతన కమిటీ



కార్పొరేటర్‌తో అసోసియేషన్ సభ్యులు

ఆల్విన్‌కాలనీ: నూతనంగా ఎన్నుకోబడిన ఉజ్జయిని మహంకాళి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌ను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన సభ్యులకు కార్పొరేటర్ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సమ్మారెడ్డి, కాలనీ అధ్యక్షుడు సిరిగిరి రాము, ఉపాధ్యక్షుడు బి. మాణిక్యం, జనరల్ సెక్రటరీ ఆర్. వెంకట్, ట్రెజరర్‌లు ఆర్‌వీ. రమణ, ఏవీ. రమణ, జాయింట్ సెక్రటరీ అంచ బాలకృష్ణ, సలహాదారులు కృష్ణ యాదవ్, సారాయి, ఆర్గనైజేషన్ కిరణ్, ఎస్.కరుణాకర్, వై. శ్రీనివాస్, డి. పరశురామ్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో అన్నదానం



ఆల్విన్‌కాలనీ: రాజేశ్వరి వృద్ధుల అనాథాశ్రమానికి సేవా దృక్పథంతో సీపీఎం కూకట్‌పల్లి శాఖ ఆధ్వర్యంలో వంద మంది అనాథలకు భోజనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీపీఎం కూకట్‌పల్లి శాఖ కార్యదర్శి పి. ధర్మారావు, కమిటీ సభ్యులు జే. బాలరాజ్ మాట్లాడుతూ..మానవ సంబంధాలు ఆర్థిక సంబంధాలుగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పెద్ద మనుషులను తమ కుటుంబాల నుంచి దూరం పెడుతూ అనాథాశ్రమంలో వేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఎం. శంకర్, జే. బాబురావు, బాలకృష్ణ, నిఖిల్, పోలయ్య, కిరణ్, సంస్థ నిర్వాహకురాలు రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

వివేకానందనగర్‌లో ఘనంగా సదర్



సదర్‌లో పాల్గొన్న కార్పొరేటర్ సబిహా బేగం, యాదవులు

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పరిధిలోని వివేకానందనగర్‌లో అల్లాపూర్ డివిజన్ శ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో సదర్ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. కార్పొరేటర్ సబిహా బేగం ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కుల మతాలలకు అతీతంగా సదర్‌ను జరుపుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నర్సింగ్ యాదవ్, చిన్నబోయిన కార్తిక్, దొనబోయిన మహేష్ యాదవ్, సురేష్ యాదవ్, జ్ఞానేశ్వర్, కొండల్‌రెడ్డి, రవీందర్ రెడ్డి, కమ్మరి శ్రీనివాస్, మురళి, యోగిరాజ్, ఆవుల శివయాదవ్, బాలరాజు యాదవ్, రవీందర్‌యాదవ్, ప్రభాకర్ యాదవ్, కనకయ్య, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ వ్యవస్థాపక దినోత్సవం



కార్మిక జెండాను ఆవిష్కరిస్తున్న సీపీఐ మండల కార్యదర్శి కృష్ణ

బాలానగర్: శ్రీశ్రీ నగర్‌లో ఏఐటీయూసీ మండల సమితి ఆధ్వర్యంలో ఏఐటీయూసీ 105వ వ్యవస్థాపక దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీపీఐ మండల కార్యదర్శి జి. కృష్ణ హాజరై కార్మిక జెండాను ఎగరవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎన్నో పోరాటాలు చేసి తెచ్చుకున్న కార్మిక చట్టాలను నేటి ప్రభుత్వాలు రద్దు చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులను సమీకరించి పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు మనోచారి, రాజుగౌడ్, జావీద్, రాములు, కృష్ణ చారి, ఉమాదేవి, చంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరాగాంధీకి ఘన నివాళి



ఇందిరిగాంధీ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

మూసాపేట: మూసాపేటలో తొలి మహిళా ప్రధానమంత్రి, భారతరత్న ఇందిరాగాంధీ వర్ధంతిని గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీపీసీసీ అధికార ప్రతినిధి డా.సత్యం శ్రీరంగం హాజరై ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదల మేలు కోసం ఆమె ఎన్నో సంస్కరణలను అమలు చేశారన్నారు. కార్యక్రమంలో ఏ బ్లాక్ అధ్యక్షులు పి. నాగిరెడ్డి, కూకట్‌పల్లి మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి, తూము మనోజ్, కర్క పెంటయ్య, పాషా, తూము సంతోష్, డివిజన్ అధ్యక్షులు మొయినుద్దీన్, తమ్మినేని ప్రవీణ్, నరసింహ యాదవ్, జోజమ్మ, భారతమ్మ తదితరులు పాల్గొన్నారు.



జీఎస్‌ఆర్ నగర్ కాలనీలో గ్లోబల్ ఫెయిత్ మినిస్ట్రీస్ షమ్మా ఫెయిత్ చర్చిలో నిర్వహించిన సువార్త సభలో పాల్గొన్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ తదితరులు

– ఆల్విన్‌కాలనీ

నేటి నుంచి శివాలయాల్లో కార్తీకమాస పూజలు



పీఆర్ నగర్‌లోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలోని శివాలయం

మోతీనగర్: మూసాపేట, డివిజన్‌లోని వివిధ బస్తీలు, కాలనీల్లో ఉన్న శివాలయాల్లో శనివారం నుంచి డిసెంబర్ 2 వరకు కార్తీక మాసం మహోత్సవాలు జరుగనున్నాయి. మూసాపేట డివిజన్‌లోని పాండురంగ నగర్ శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాస పూజలకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కార్య నిర్వహణాధికారి కృష్ణ పేర్కొన్నారు. ప్రతి రోజు శివాలయాల్లో ఉదయం తెల్లవారుజామున 4 గంటలకు అభిషేకంతో కార్తీక మహోత్సవ పూజలు ప్రారంభం అవుతాయని తెలిపారు. అదే విధంగా అల్లాపూర్ డివిజన్ పర్వత్‌నగర్ పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వర స్వామి దేవాలయంలో కార్తీక మాసం పూజలు నిర్వహించనున్నారు. ప్రతి రోజు ఉదయం 5 గంటల నుంచి అభిషేకాలు ప్రారంభమవుతాయి. మొదటి సోమవారం బిల్వార్చన, రెండవ సోమవారం పుష్పార్చన, మూడో సోమవారం భస్మాభిషేకం, నాల్గొవ సోమవారం తైలాభిషేకం, తిలార్చన, 15న కార్తీక పౌర్ణమి, కార్తీక దీపోత్సవం, 19న ఆరుద్ర నక్షత్రం సందర్భంగా అన్నదానం నిర్వహిస్తారు. 28వ మాస శివరాత్రి సందర్భంగా ఏకాదశ వార రుద్ర హోమం, మహా మృత్యుంజయ హోమం నిర్వహిస్తారు. అదే విధంగా వి.రామారావు నగర్, శివాజీనగర్, వివేకానందనగర్‌లతో పాటు పలు కాలనీల్లో ఉన్న శివాలయాల్లో కార్తీక పూజలు కొనసాగనున్నాయి.

పార్కును అందుబాటులోకి తీసుకురావాలి



హెచ్‌ఎండీఏ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రవికుమార్‌యాదవ్, నాయకులు

ఆల్విన్‌కాలనీ: మిత్ర హిల్స్ పార్కును ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి రాసిన వినతిపత్రాన్ని శుక్రవారం హెచ్‌ఎండీఏ కమిషనర్ సిరాజ్ సర్ఫరాజ్‌కు బీజేపీ నేత రవికుమార్ యాదవ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మిత్ర హిల్స్ కాలనీ కమిటీతో కలిసి కమిషనర్‌కు సమస్యలను వివరించామన్నారు. హైదర్‌నగర్ డివిజన్ మిత్రహిల్స్‌లోని పార్కు చుట్టూ విష సర్పాలు తిరుగుతున్నాయని, దీంతో ప్రజలు భయాందోళనకు గురి అవుతున్నారన్నారు. వెంటనే పార్కును శుభ్రం చేయించాలన్నారు. ఉపయోగంలో లేకపోవడం వల్ల పార్కు ఏపుగా పెరిగిన కలుపు మొక్కలతో దర్శనమిస్తోందన్నారు. కార్యక్రమంలో బొల్లేపల్లి సీతారామరాజు, భరత్‌కుమార్, సుబ్బారావు, సుధాకర్‌రెడ్డి రమేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో గొడవ.. కేసు నమోదు

కేపీహెచ్‌బీకాలనీ: దీపావళి పండుగ జరుపుకుని అల్పాహారం తినేందుకు వచ్చిన ఐదుగురు మూత్రశాలను వినియోగించుకునే క్రమంలో మరో 8 మందితో గొడవపడి చితకబాదారు. ఈ ఘటన కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం అర్ధరాత్రి జరిగింది. ఎస్ఐ రూప వివరాల ప్రకారం.. మియాపూర్ ప్రాంతంలో నివాసం ఉండే సత్య కల్యాణ్ మరో నలుగురు స్నేహితులతో కలిసి భాగ్యనగర్ కాలనీ ప్రాంతంలోని సిరి టిఫిన్ సెంటర్‌కు వచ్చారు. వీరంతా మూత్రశాలకు వెళ్లడంతో అప్పుడే అక్కడికి వచ్చిన కేపీహెచ్‌బీ కాలనీ ప్రాంతానికి చెందిన తేజ అలియాస్ లడ్డూ మరో ఏడుగురు స్నేహితులు కూడా మూత్రశాల వద్ద వేచి ఉండటంతో పాటు ఎంత సేపటికీ బయటకు రాకపోవడంతో బయట డోర్ కొట్టి పిలిచారు. దీంతో లోపలి వైపు నుంచి తిట్లు వినిపించడంతో వారు బయటకు రాగానే తేజ అతని స్నేహితులు గొడవ పడ్డారు. ఇరువురి నడుమ గొడవ పెద్దదిగా మారి కర్రలతో దాడి చేసుకున్నారు. దీంతో సత్య కల్యాణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వల్లభాయ్ పటేల్ త్యాగాలను స్మరించుకోవాలి

ఎంపీ ఈటల రాజేందర్



రన్‌ఫర్ యూనిటీ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ ఈటల రాజేందర్, బీజేపీ నాయకులు

కూకట్‌పల్లి: సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. జయంతి సందర్భంగా ఏక్తా దివస్ రన్‌ఫర్ యూనిటీ కార్యక్రమాన్ని బీజేపీ కూకట్‌పల్లి ఇన్‌చార్జి మాధవరం కాంతారావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎంపీలు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఈటల రాజేందర్ ముఖ్య అతిథులుగా విచ్చేసి సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..నరేంద్ర మోదీ 2013లో ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రన్ ఫర్ యూనిటీ కార్యక్రమాన్ని దేశమంతా ఒకటిగా ఉండాలని కోరుతూ రన్ ఫర్ యూనిటీ కార్యక్రమాన్ని జరుపుకున్నారని గుర్తు చేశారు. 10 సంవత్సరాలుగా కూకట్‌పల్లిలో మాత్రమే ఈ కార్యక్రమాన్ని జరుపుకోవడం మన అదృష్టమన్నారు. పాఠశాల విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేపీహెచ్‌బీకాలనీ: సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు డివిజన్‌లోని సర్దార్ పటేల్‌నగర్‌లోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశాన్ని ఐక్యం చేయడంలో ఉక్కు సంకల్పంతో పోరాడిన మహోన్నత వ్యక్తి వల్లభాయ్ పటేల్ అని అన్నారు. అనంతరం సీసీ రోడ్డు పనులను పర్యవేక్షించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు కృష్ణారెడ్డి, నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

మూసాపేట: మూసాపేటలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా పలువురు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు తూము శైలేష్ కుమార్, శ్రీనివాస్, సోముల శంకర్, సప్పిడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



పూలమాలేసి నివాళి అర్పిస్తున్న కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు తదితరులు



విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

భక్తిశ్రద్ధలతో దీపావళి వేడుకలు



వ్యవసాయ క్షేత్రంలో దీపావళి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కృష్ణారావు తదితరులు

దీపావళి పండుగను పురస్కరించుకొని కూకట్‌పల్లి జంట సర్కిళ్ల పరిధిలో పలువురు నాయకులు ఎంపీ, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్‌లకు, పార్టీల నాయకులకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. దీపావళి సందర్భంగా ప్రజల జీవితాల్లో కొత్త వెలుగులు నిండాలని ఆకాంక్షించారు. దీపావళి వేడుకలను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. బాణాసంచా పేల్చారు. –కూకట్‌పల్లి



కుటుంబ సభ్యులతో దీపావళి వేడుకల్లో పాల్గొన్న శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ



ఎంపీ ఈటల రాజేందర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు



టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్‌కు శుభాకాంక్షలు తెలిపిన సత్యం శ్రీరంగం కుటుంబ సభ్యులు